క్లుప్తంగా

బ్యాంక్ ఎదుట రైతుల నిరసన



అయిజ: రుణమాఫీ వచ్చిన రైతులకు బ్యాంక్ అధికారులు సకాలంలో కొత్త రుణాలు ఇవ్వడం లేదని అన్నదాతలు మంగళవారం బ్యాంక్ ఎదుట నిరసన తెలిపారు. సోమవారం ఎస్‌బీఐ అయిజ బ్రాంచ్ ఎదుట మండలంలోని వివిధ గ్రామాల రైతులు ప్రభుత్వానికి, బ్యాంక్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వర్షాకాలం పెట్టుబడుల కోసం రుణాలు ఇవ్వడం లేదని వాపోయారు. తేదీలను ప్రకటించి బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని, పంట రుణం మాత్రం మంజూరు చేయడం లేదని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం పంటకు సంబంధించిన రైతు భరోసా బ్యాంక్ ఖాతాల్లో జమచేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మండలంలోని పులికల్, పర్దిపురం, మేడికొండ, బైనిపల్లి, రాజాపురం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

అలంపూర్: ఉమ్మడి వ్యవసాయ సహకారం సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి మహేష్ తెలిపారు. అలంపూర్ మండలంలోని క్యాతూర్‌లో ఉమ్మడి వ్యవసాయ సహకారం సంఘం ఎన్నికలు మంగళవారం ముగిసాయి. పదేళ్లుగా ఉమ్మడి వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించలేదని పేర్కొన్నారు. ఉమ్మడి వ్యవసాయ సహకారం సంఘంలో మొత్తం 17 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి హెచ్ స్వాములు, ఉపాధ్యక్ష పదవికి దండు హుస్సేన్, కార్యదర్శి పదవికి మద్దిలేటి నామినేషన్లు దాఖలు చేయగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా కుడవెల్లి పుల్లమ్మ, హెచ్ ఎల్లమ్మ, దండు వెంకటస్వామి, దండు సవారి, హెచ్ నరసింహ, పుల్లారి చిన్న బాలస్వామి ఎన్నికైనట్లు తెలిపారు.

'గాంధీజీ బాటలో నడవాలి'



గట్టు: గాంధీజీ చూపిన సత్యం, అహింస, సత్యాగ్రహం అనే సన్మార్గాలను ఎంచుకుని, ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలని గ్రామ స్వరాజ్యం అధ్యక్షుడు రాజుసాగర్ తెలిపారు. మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం గట్టులోని ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, టీఎస్‌టీయు జిల్లా అధ్యక్షుడు రమేష్, గ్రామ స్వరాజ్యం అధ్యక్షుడు రాజుసాగర్, తపస్ మండల అధ్యక్షుడు పరశురాం, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ నర్సింహులుగౌడు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజు, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యాయులు సుజాత, రాముడు, స్వప్న, మోహన్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్‌లో శ్రమదానం



మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిశిలా క్షేత్రం ఆవరణలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న చెత్త చెదారం తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే ఆదిశిలా క్షేత్రం పరిసరాల్లో ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల శ్రమదానం పట్ల గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామాంజనేయులు గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు తరలింపు

కేటీదొడ్డి: తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను మంగళవారం కేటీదొడ్డి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు సెప్టెంబర్ 30 న ఎర్సందొడ్డి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి పట్టపగలే తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఇద్దరు దొంగలను పట్టుకున్నామన్నారు.



గుడ్డెందొడ్డి గురుకుల పాఠశాలలో ..



బొంకూరులో బతుకమ్మలతో విద్యార్థులు



గట్టు మండలం రాయాపురంలో...



బతుకమ్మలతో అలంపూర్ విశ్వశాంతి ఉపాధ్యాయులు

బడుల్లో బతుకమ్మ సంబరాలు



ఉండవెల్లి పాఠశాలలో..

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం చివరి పనిదినం కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బాలబాలికలు వివిధ రకాల పూలను తీసుకువచ్చి పాఠశాలలో బతుకమ్మలను పేర్చి అట్టహాసంగా సంబరం నిర్వహించారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యం చేశారు. విద్యార్థుల కేరింతలతో పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. **- సాక్షి నెట్‌వర్క్**



రామాపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో..



మానవపాడులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



మల్దకల్‌లో..



ఎర్రవల్లిలో బతుకమ్మ దగ్గర నృత్యం చేస్తున్న విద్యార్థులు.



బతుకమ్మ సంబరాల్లో ధరూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె పాఠశాలలో..

విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమమే..

అలంపూర్: తొలగించిన ఉద్యోగిని విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మద్దయ్య అన్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి టోల్‌ప్లాజా కార్యాలయం, టోల్‌లేన్స్‌లలో నిరసన తెలిపారు. టోల్‌ప్లాజా వర్కర్స్ యునియన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న హుస్సేన్‌బాషాను యాజమాన్యం అకారణంగా విధుల నుంచి తప్పించిందని ఆరోపించారు. నెల రోజుల క్రితమే ఈ విషయమై కార్మిక సంఘం యాజమాన్యంతో మాట్లాడితే విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా.. మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. తొలగించిన ఉద్యోగిని విధుల్లోకి తీసుకోకపోతే దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, పీటర్, లాజర్, వెంకట్రాముడు, శేషన్న, హుస్సేన్‌బాషా, నాగన్న, ఓబ్లేస్, రామ్, లక్ష్మన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

గద్వాల అర్బన్: ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నడిగడ్డ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుపోగుల రాజు, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో మెనూ పాటించడం లేదని, బాత్‌రూంలు అపరిశుభ్రత ఉన్నాయని, వార్డెన్ హాస్టల్‌కు సరిగ్గా రావడం లేదని ఆరోపించారు. అన్నంలో పురుగులు, పప్పు, సాంబారులో బొందికలు రావడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్నారు. జిల్లాలోని హాస్టళ్లపై విచారణ జరిపి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వార్డెన్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్యం, దౌలత్, వినోద్, రాకేష్, చక్రి, హరి తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థిసంఘం నాయకులు

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కాలం చెల్లిన విద్యుత్ పరికరాలను తొలగించడంతో పాటు కొత్త పరికరాలు ఏర్పాటు చేసి, నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని కమంతం పేటలో కాలం చెల్లిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మరమ్మతు పనుల కారణంగా బుధవారం అయిజ, వడ్డెపల్లి, రాజోళి మండలాల్లో కొన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెంకటాపురం ఫీడర్ విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మండలంలోని వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పర్దిపురం, కిష్టాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి గ్రామాలతో పాటు ఉప్పల సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంతో పాటు రాజోలి మండలంలోని పచ్చర్ల, మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, నసనూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.



స్తంభం ఏర్పాటు చేయిస్తున్న ఏఈ నరేందర్‌రెడ్డి

పిచ్చిమొక్కల తొలగింపు



శాంతినగర్: వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి రోగులకు ఇబ్బందిగా ఉండేది. రాత్రి వేళల్లో పీహెచ్‌సీలో ఉండాలంటే రోగులు, వారి వెంట వచ్చే అటెండెంట్లు భయాందోళనకు గురయ్యేవారు. విషసర్పాల సంచారంతో బయటకు వచ్చేవారు కాదు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి హెల్త్ సిబ్బంది వివరించగా.. స్పందించిన ఆయన జేసీబీతో పీహెచ్‌సీ ఆవరణలోని పిచ్చిమొక్కలను మంగళవారం తొలగించారు.

యూనిఫాం పంపిణీ



మల్దకల్: మండలంలోని పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్ చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న దుస్తులను సద్వినియోగం చేసుకుని మెరుగైన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు నాగరాజు, చక్రాధర్, అంగన్‌వాడీ టీచర్లు ధర్మావతమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన

అలంపూర్: మూడేళ్ల పోరాటాలను సమీక్షించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసు, ఈదన్న పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో సీపీఎం మహసభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా వెంకటస్వామిని, మరో ఆరుగురు కమిటి సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రజా పోరాటలను ఉధృతం చేద్దామన్నారు. వరద బాధితులకు ఇళ్ల స్థలాలు, కందకం పుద్చాలని, పేదలకు ఇళ్ల స్థలాలు కోసం పోరాటం చేద్దామన్నారు. అనంతరం పార్టీ కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ నెల 6వ తేదీన అలంపూర్ మండలంలో పార్టీ మహసభలు జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నరసింహ, నాగరాజు, ఆశన్న, సిద్ధయ్య, అయ్యప్ప, మాలిక్‌బాషా, రఫీ, మౌలాలి తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



అయిజ: పూర్వ విద్యార్థి రాబిన్‌సన్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పుణెలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించినందున మండల కేంద్రంలో శ్రీకృష్ణవేణి పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం శాలువాతో సన్మానించారు

పంట నష్ట పరిహారం అందించాలి

రాజోళి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.లక్షల పెట్టుబడులు పెట్టిన పంటలు చేతికొచ్చే సమయానికి వర్షాల కారణంగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. వారితో పాటు కౌలు రైతులు కూడా ముందస్తు కౌలు చెల్లించి, పెట్టుబడులు పెట్టారని వారికి కూడా ప్రభుత్వం సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలకు నేలకూలిన ఇళ్లకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని, వారికి పరిహారం అందిస్తూనే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

అయిజ: మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు సబ్ డివిజన్ ఏడీఈ నీలి గోవింద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 31.5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 50 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్నట్లు తెలిపారు. అయిజ, గట్టు, మల్దకల్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో, రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి, కేటీ దొడ్డి మండలంలోని చింతలకుంట సబ్‌స్టేషన్‌లో 5 రోజుల పాటు ప్రతి రోజు 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఉద్యోగులకు సేవతోనే గుర్తింపు

అలంపూర్: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలతోనే గుర్తింపు పొందుతారని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ లక్ష్మయ్య పదవీ విరమణ కార్యక్రమం ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు హాజరై లక్ష్మయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తిప్పారెడ్డి, రఘురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్రామయ్య శెట్టి, చక్రపాణిరెడ్డి, గోపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, సూర్య తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు ఏర్పాటు చేయండి



ప్రిన్సిపాల్ రామఓబులేష్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

శాంతినగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాంతినగర్ నుంచి ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు ఏర్పాటు చేసి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని బీఆర్‌ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్ బాబు ప్రిన్సిపాల్‌ను కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతనంగా వచ్చిన ప్రిన్సిపాల్ రామఓబులేష్‌ను బీఆర్‌ఎస్వీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఏడుకొండలు, ప్రదీప్, మహేష్, రాఘవేంద్ర, విద్యార్థులు పరశురాం, వేణు, గంగాధర్ పాల్గొన్నారు.

'క్రాప్ సర్వేపై ప్రభుత్వం పునరాలోచించాలి'

అయిజ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే క్లస్టర్ మొత్తం ఏఈఓలు చేయడం కష్టతరమైందని, సర్వే కోసం గ్రామ స్థాయిలో సహాయకులను నియమించాలని ఏఈఓ సంఘం జిల్లా అధ్యక్షుడు లోకరాజు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనం వద్ద ఏఈఓలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు సమస్య విన్నవించినా ఇంతవరకు పరిష్కారం చూపకుండా ఏఈఓలపై డీసీఎస్ కోసం ఒత్తిడి తీసుకొస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు.

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి రైతువేదిక వద్ద వ్యవసాయ అధికారులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా డిజిటల్ క్రాప్ సర్వేను క్లస్టర్‌లోని ఏఈఓ 5 నుంచి 8 గ్రామాలకు సంబంధించి 6 వేల నుంచి 10 వేల ఎకరాలు చేయడం కష్టమైన పని తెలిపారు. డీసీఎస్ సర్వే కోసం గ్రామ స్థాయిలో సహాయకులను నియమించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు విన్నవించినా, సమస్యను పరిష్కరించలేదని వ్యవసాయ అధికారులు వాపోయారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయిజలో నిరసన తెలుపుతున్న ఏఈఓలు

'ఆకతాయిల ఆగడాలు అరికడదాం'



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

రాజోళి: ఆకతాయిలు, పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేసి మహిళలు, యువతులకు రక్షణ కల్పించేందుకే షీ టీంలు ఉన్నాయని షీటీం సిబ్బంది దివ్య, హన్మంతు, శేషన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రం రాజోళిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా బాలికలు ఒంటరిగా ఉన్న సమయంలో ఆకతాయిల నుంచి చాకచక్యంగా వ్యవహరించాలనే అంశాలతో పాటు, అత్యవసర సమయంలో 100 డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మహిళలు అధైర్యపడకుండా సమాచారాన్ని 87126 70312కు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ భగీరథరెడ్డి, ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హన్మిరెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలను సద్వినియోగించుకోవాలి

ఎర్రవల్లి: కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ వారణాసి రంజిత్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల పరిధిలోని వల్లూరులో నాబార్డు సౌజన్యంతో ఏపీజీవీబీ సాసనూలు శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాబృందం సభ్యులు హాజరై బ్యాంకు ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలతో పాటు సౌకర్యాల గురించి ఆటలు, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ వారణాసి రంజిత్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తప్పకుండా మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలలో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏటీఎం రూపే కార్డులను వినియోగించాలన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు ఇటీవల మరణించిన మురళీ మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు.



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ రంజిత్